ప్రజాశక్తి

సోమవారం 6 మార్చి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పట్టని ఎన్నికల కోడ్..!

- యథేచ్ఛగా ఉల్లంఘనలు
- పట్టించుకోని ఎన్నికల సంఘం
- అంతులేని అధికార దుర్వినియోగం
- తాజాగా సీతమ్మధారలో వాలంటీర్లతో పట్టభద్రులను తీసుకొచ్చి సమావేశం

వేదికపై సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవివి, సుధాకర్ తదితరులు



Forwarded

వాలింటర్లకు మనవి! రేపు మధ్యాహ్నం 3 గంటలకు సీతమ్మధార రాధాకృష్ణ ఫంక్షన్ హాలులో,మీ యొక్క క్లస్టర్లో వున్న పట్టబద్రుల ఓటర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరుగుతుంది.ఈయొక్క కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టిటిడి ఛైర్మన్,విశాఖ,అనకాపల్లి,విజయనగరం జిల్లాల YSRCP రీజనల్ కోఆర్డినేటర్ గౌ.శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు విచ్చేయుచున్నారు.వారేకాకుండా VMRDA చైర్ పర్సన్,విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త గౌ.శ్రీమతి అక్కరమాని విజయనిర్మల గారు,ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్,పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్ధి అయినటువంటి గౌ.శ్రీ సీతంరాజు సుధాకర్ గారు విచ్చేయుచున్నారు.కావున ప్రతిఒక్క వాలింటర్ మీ యొక్క ఓటర్లతో టైం తప్పకుండా హాజరు కాగలరని కోరుకుంటూ.....ఇట్లు.. మొల్లి అప్పారావు.

19:13

Message

పట్టభద్రులను సమావేశానికి తీసుకురావాలంటూ వాలంటీర్లకు వాట్సాప్‌లో పంపిన మెసేజ్

ప్రజాశక్తి - విశాఖపట్నం

విశాఖలో ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తున్నవారిపై చర్యలు కానరావడం లేదు. అధికార పార్టీ నేతలు, కొంతమంది అధికారులు, వాలంటీర్లు పదేపదే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. వీటిపై ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, సిపిఎం, ప్రజా సంఘాలు ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా అతిక్రమించిన వారిపై చర్యలు కానరావడం లేదు.

వాస్తవానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ దుర్వినియోగానికి అడ్డూఅదుపూలేకుండా పోయింది. తమ అధికారాలను అడ్డంపెట్టుకొని అనర్హులను ఓటర్లుగా నమోదుచేసిన దగ్గర నుంచి... ఎన్నికలు సమీపించడంతో ప్రచారం వరకు బరితెగించి వ్యవహరిస్తున్నా ఎన్నికల సంఘంగానీ, ఎన్నికల అధికారులుగానీ కట్టడిచేయడంలేదు. దసపల్లా హోటల్‌లో నిర్వహించిన కెజిబివి ఉద్యోగుల సమావేశంలో వైసిపి అభ్యర్థి సుధాకర్ పాల్గొన్నారు. ఈ వివాదమింకా ముగియకుండానే, ఆంధ్రా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రసాద్‌రెడ్డి మరొకడుగు ముందుకేసి, ప్రయివేటు డిగ్రీ కళాశాలల కరస్పాండెట్లతో ఇదే హోటల్లో సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర వైసిపి సమన్వయకర్త వైవి. సుబ్బారెడ్డి, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి కరస్పాండెంట్లతో నిర్వహించిన ఈ సమావేశంలో ఎయు విసి పాల్గొన్నట్లు బయట పడినా, తాను పాల్గొనలేదని బుకాయించి అధికార పార్టీ మిగతా 2లో..

సంతాప సభలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి, వేదికపై సిహెచ్.నర్సింగరావు, వై.వెంకటేశ్వరరావు, లోకనాథం, జగ్గునాయుడు, ప్రభావతి తదితరులు

పార్వతమ్మ ఆశయ సాధనకు కృషి

సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి - అచ్యుతాపురం (అనకాపల్లి)

సిపిఎం సీనియర్ నాయకురాలు, సారా వ్యతిరేక ఉద్యమ నేత కర్రి పార్వతమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆమె గొప్ప పోరాట యోధురాలని కొనియాడారు. పార్వతమ్మ సంతాప సభ తిమ్మరాజుపేట గ్రామంలోని ఆమె స్వగృహం వద్ద ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, అనకాపల్లి, విశాఖ జిల్లా కార్యదర్శులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్ కుమార్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, రాష్ట్ర నాయకులు పి.శేషారత్నం, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎ.బాలకృష్ణ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, ఎంపిపి కోన సంధ్య బుజ్జి, అజయ్ కుమార్, సారా వ్యతిరేక ఉద్యమ నాయకులు సూర్యనారాయణ, తిమ్మరాజుపేట గ్రామ సర్పంచ్ ఎస్.భాగ్యలక్ష్మి బాబు నాయుడు, డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకులు కర్రి సుందరయ్య, స్వామి బాబు, రూపవతి, సుగుణ, కె.రామసదాశివరావు పాల్గొన్నారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

'శ్రీ చైతన్య'లో విద్యార్థుల కొట్లాట

▶ వార్త 3లో..

వైభవంగా అనంతుని తెప్పోత్సవం

▶ వార్త 3లో..

పారిశ్రామికవేత్తలు సహకారం అందించాలి

▶ వార్త 3లో..

స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభ, చిత్రంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నిరుద్యోగులకు అండగా ఉంటా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

వార్త 2లో..

జీడిపండు ప్రాసెసింగ్‌తో ఆదాయం

- తోటబడి ద్వారా సాగు మెళకువలు
- ఫ్రూట్ వకర్స్ టెక్నాలజీతో మామిడిలో అధిక దిగుబడులు
- 'ప్రజాశక్తి'తో జిల్లా ఉద్యాన అధికారి ప్రభాకరరావు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'జిల్లాలో 24 మండలాల్లోని 70 వేల ఎకరాల్లో జీడి మామిడి, 20 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఈ ఏడాది జీడి మామిడి, మామిడి పూత ఆశాజనకంగా వుంది. నాణ్యమైన దిగుబడులు సాధించి, ఆదాయం పెంచుకొనేలా రైతులకు ఉద్యానశాఖ తోటబడి ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సాగులో మెళకువలను, తెగులు, పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు రైతు భరోసా కేంద్రాల ద్వారా తెలియజేస్తున్నాం. రాష్ట్రంలో జీడిమామిడి సాగులో జిల్లా రెండో స్థానంలోనూ, దిగుబడిలో మొదటి స్థానంలోనూ వుంది. కేరళ అగ్రికల్చరల్ యూనివర్సిటీ మడకత్తర ప్రాంతంలోని జీడిమామిడి పరిశోధన సంస్థ తన పరిశోధనలో జీడి మామిడి పండు ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయవచ్చని తెలిపింది' అని జిల్లా ఉద్యాన అధికారి, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.ప్రభాకరరావు తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఆయన ఆదివారం ఇంటర్వ్యూ ఇచ్చారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో జీడిమామిడి, మామిడి సాగు విస్తీర్ణం ఎంత ?

జిల్లాలో 24 మండలాల్లోని 70 వేల ఎకరాల్లో జీడిమామిడి, 20 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఈ ఏడాది జీడిమామిడి, మామిడి పూత ఆశాజనకంగా వుంది. రైతులు సాగు మెళకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించడం ద్వారా ఆదాయం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జీడిపండు ప్రాసెసింగ్‌తో ఆదాయం

పొందుతారు.

సాగు మెళకువలపై శాఖాపరంగా చేస్తున్న కృషి ఏంటి ?

జీడిమామిడి, మామిడి రైతులకు సాగులో మెళకువలను, సాగు పద్ధతిని తోటబడి కార్యక్రమం ద్వారా తెలియజేస్తున్నాం. జీడిమామిడి రైతుల కోసం ఇప్పటివరకు 354 తోటబడి కార్యక్రమాలు నిర్వహించాం. శాస్త్రీయ పద్ధతి, రైతు సొంత పద్ధతి, ఇంటిగ్రేటెడ్ పద్ధతిలో సాగు చేయించడం ద్వారా వచ్చే లాభాలను రైతులకు వివరిస్తున్నాం. ప్రతి 15 రోజులకూ ఒకసారి శిక్షణ ఇస్తున్నాం. ఖర్చులు తగ్గించుకొని దిగుబడులు పెంచే పద్ధతులపై రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఎరువుల వినియోగం, నీరు పెట్టడం, తెగులు గుర్తించడం, వాటి నివారణోపాయాలపై శిక్షణ ఇస్తున్నాం.

ఏ మండలాల్లో ఈ సాగు ఎక్కువగా వుంది ?

జీడిమామిడి సాగు ఎక్కువగా నాతవరం, రోలుగుంట, నర్సీపట్నం, రావికమతం, కోటవురట్ల, ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి మండలాల్లో వుంది. 42 వేల మంది రైతులు సాగుచేస్తున్నారు. రాష్ట్రంలో జీడిమామిడి సాగు రెండో స్థానంలో వుంది. దిగుబడిలో మొదటి స్థానంలో వుంది. జిల్లాలో ఈ ఏడాది 20 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. జీడి పిక్కల పరిశ్రమలు 23 వున్నాయి. జిల్లాలో మామిడి 20 వేల ఎకరాల్లో సాగవుతోంది. ఎక్కువగా కె.కోటపాడు, సబ్బవరం, బుచ్చెయ్యపేట, మాకవరపాలెం, నక్కపల్లి, నర్సీపట్నం మండలాల్లో పండిస్తున్నారు.

జీడిమామిడి రైతులకు అధిక ఆదాయం వచ్చే మార్గాలేంటి ?

ఇటీవల కాలంలో జీడిపండు వుపయోగం ప్రాచుర్యంలోకి వచ్చింది. కేరళ అగ్రికల్చరల్ యూనివర్శిటీ మడకత్తర ప్రాంతంలోని జీడిమామిడి పరిశోధన సంస్థలో జీడిపండు నుంచి అనేక రకాల విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేస్తున్నారు. జీడిపండు ద్వారా క్యాండీ, ఎనర్జీబార్, జ్యూస్, సిరప్, జాము, పికెల్, కార్బొనేటెడ్ ఫ్రూట్ డ్రింక్ వంటివి తయారుచేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులను చిన్నచిన్న పరిశ్రమల ద్వారా తయారుచేస్తున్నారు. పోషక విలువలు కూడా ఎక్కువగా వున్నాయి. గోవాలో ఫెన్నీ ఆల్కాహాల్ తయారుచేసి అధిక ఆదాయం పొందుతున్నారు. ప్రాసెసింగ్ ఉత్పత్తుల ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశాలు ఎక్కువగా వున్నాయి.

మామిడి దిగుబడులు పెరగడానికి మీరిచ్చే సూచనలేంటి ?

పురుగు, తెగులు నివారణకు నాణ్యమైన దిగుబడులు, మంచిధర రావడానికి కొత్తగా ఫ్రూట్ వకర్స్ టెక్నాలజీ ఉపయోగకరంగా వుంది. నిమ్మకాయదశలో కాయ వున్నప్పుడు కవర్‌కట్టి, కోతకు వారం రోజుల ముందు కవర్‌ను తొలగించాలి. దీనివల్ల కాయ నాణ్యతతో పాటు మంచి ధర వస్తుంది. సేంద్రీయ పద్ధతిలో సాగవుతుంది. ఫ్రూట్ కవర్స్‌ను ఉపయోగిస్తే ఎకరాకు అదనంగా టన్ను వరకు దిగుబడి పెరగడం ద్వారా 40 నుంచి 50 వేల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. ఎకరానికి నాలుగు వేల కవర్లకు పది వేల రూపాయలు ఖర్చయినా దిగుబడి పెరగడంతో మంచి ఆదాయం రైతుకు వస్తుంది.

పట్టని ఎన్నికల కోడ్..!

అండతో తాత్కాలికంగా తప్పించుకోగలిగారు. ఈ వివాదమిలా నడుస్తుండగానే ఆనందపురం, పద్మనాభం మండలాల ఎంఇఒలు వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాకానుక, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల వంటి అకడమిక్ అంశాలపై ఉపాధ్యాయులతో సమావేశాల పేరిట అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా మీటింగ్‌లు పెట్టారు.

ఈసారి వాలంటీర్ల సాయంతో..

తాజాగా వాలంటీర్లతో పట్టభద్రులను తీసుకొచ్చి సీతమ్మధారలో సమావేశం నిర్వహించారు. ఆ వివరాల్లోకి వెళితే.. సీతమ్మధారలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో వైసిపి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆదివారం ఆత్మీయ సమావేశం పేరిట ఓ కార్యక్రమం తలపెట్టారు. ప్రతి వాలంటీర్ తమ పరిధిలోని పట్టభద్రులను ఈ సమావేశానికి తీసుకురావాలని జివిఎంసి 16వ వార్డు వైసిపి కార్పొరేటర్ మొల్లి అప్పారావు పేరిట వాట్సాప్‌లో మెసేజ్‌లు వెళ్లాయి. ఈ క్రమంలోనే సుమారు 150 మంది వాలంటీర్లు, పట్టభద్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు. టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి దీనికి ముఖ్య అతిథిగా హాజరై శాసనమండలి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సీతంరాజు సుధాకర్, కెకె.రాజు తదితరులు పాల్గొనారు. వాస్తవానికి ఎన్నికల పనులకు వాలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల అధికారి తెలిపినా ఆచరణలో ఆ విధంగా జరగడం లేదు. పింఛన్ల పంపిణీ సమయంలోనూ వారు అధికార పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని పింఛనుదారులపై ఒత్తిడి తెచ్చిన విషయం తెలిసిందే.

ఫిర్యాదుపై స్పందించని జిల్లా ఎన్నికల అధికారి

వార్డు వాలంటీర్లను ఉపయోగించి పట్టభద్రులతో సమావేశం నిర్వహిస్తున్నారని ఆదివారం ఉదయమే ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. సమావేశాన్ని అడ్డుకోవాలని కోరారు. అయినప్పటికీ ఆ దిశగా చర్యలు కానరాలేదు.

నిరుద్యోగ యువతకు అండగా ఉంటా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉండి, మీ సమస్యలపై చట్ట సభలలో గొంతు వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రూప్ 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు జరిగింది. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కృష్ణా, గుంటూరు జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సదస్సులో పాల్గొన్న రమాప్రభ మాట్లాడుతూ ఇంత వరకు పరిపాలించిన పాలకులు, నేడు పరిపాలిస్తున్న వారు ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా యువతకు జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేసి అన్యాయం చేసిందన్నారు. దానిపై పోరాటం చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై ఎన్నో కేసులు పెట్టి కక్ష సాధింపు చేస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో ఉన్న పరిశ్రమలను మూసివేయడం వల్ల ఉత్తరాంధ్ర నుంచి కూలీలతో పాటు, నిరుద్యోగ యువత కూడా వలసలు పోతున్నారన్నారు. లక్షా 50వేల మందికి ఉపాధి కల్పిస్తూ, 3లక్షల కోట్లు విలువైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రూ.30వేల కోట్లకు అదానికీ అమ్మేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈ ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే యువతంతా సంఘటితమై పోరాడాలన్నారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాను పిడిఎఫ్ ఎమ్మెల్సీల స్ఫూర్తితో నిరాడంబరంగా, నిస్వార్థంతో ఉత్తరాంధ్ర హక్కుల కోసం, అభివృద్ధి కోసం, నిరుద్యోగ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ అందచేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేష్, పి.రామ్మోహన్, డివైఎఫ్ఐ నాయకులు హరీష్, పావని ,యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఅర్ కె ఈశ్వరరావు, నిరుద్యోగ అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత ఓట్ల కోసమే సమ్మిట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖలో వైసిపి నేతలు చేస్తున్న భూ దందాల నుంచి ప్రజల దృష్టి మరల్చడం కోసం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత ఓట్ల కోసం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించారని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి హయాంలో జరిగిన పెట్టుబడుల ఒప్పందాలను వైసిపి ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. లూలూ గ్రూప్ టెంపుల్ టన్ కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలను వైసిపి బెదిరించి ఇక్కడి నుంచి పంపించేసిందని ఆరోపించారు. సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్లు రావడానికి వచ్చే ప్రభుత్వం టిడిపినేనని పారిశ్రామిక వేత్తలు నమ్మడమే కారణమన్నారు. సమ్మిట్‌లో భోజనాలు దగ్గర తన్నులాట కనిపించిందని, రాష్ట్ర పరువు మంట కలిసిందని తెలిపారు. పరిశ్రమలను ఇక్కడి నుంచి తరిమేసిన వారు పరిశ్రమలు రావాలని కోరడంలోగల ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. అమర్ రాజా సంస్థ పెట్టుబడి పెడతాం అంటే సజ్జల పొమ్మనమని బహిరంగంగానే చెప్పారన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా జిఐఎస్ సమ్మిట్ నిర్వహించారని మండిపడ్డారు.

మాజీ ఎమ్మెల్సీ కెఎస్.రామకృష్ణ మాట్లాడుతూ విశాఖను పరిపాలనా రాజధానిగా చూపిస్తూ ఇక్కడ భూములను వైసిపి నేతలు దోచుకుంటున్నారన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ వైసిపి పాలనలో ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు ఆవేదన చెందుతున్నారన్నారు.

కోడి వ్యర్థాలు అమ్ముకుంటున్న కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కోడి వ్యర్థాలను సేకరించి చేపల, రొయ్యల చెరువులకు అమ్ముకుంటున్న అధికార పార్టీ కార్పొరేటర్లు, వారికి సహకరిస్తున్న జివిఎంసి అధికారులపై చర్యలు తీసుకోవాలని సమాచార పరిరక్షణ సమితి కన్వీనర్ కొమర కృష్ణ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో అనధికారికంగా అతి ప్రమాదకరమైన కోడి వ్యర్థాల వ్యాపారం యథేచ్ఛగా జరుగుతుందన్నారు. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లే అందులో కీలక సూత్రధారులుగా మారి లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యర్థాలను నగరంలోని అన్ని చికెన్ సెంటర్ల నుంచీ పెద్ద పెద్ద బొలారో వాహనాలలో సేకరించి చేపల చెరువులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. చేపలు, దీనిని తిని నెలా, రెండు నెలల వ్యవధిలో పెరగడంతో పెంపకందారులకు బాగా ఆదాయవనరుగా మారిందన్నారు.

కళాకారుల వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాకారుల మెగా మెడికల్ క్యాంప్ విజయవంతమైంది. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి సుమారు 300 మంది కళాకారులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నగరానికి చెందిన వైద్యుల పర్యవేక్షణలో సుగర్, బిపి పరీక్షలతో పాటు దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ వైద్యులు డాక్టర్ కృష్ణ హారిక, డాక్టర్ సాయిలక్ష్మి, డాక్టర్ కృష్ణ కీర్తి, డాక్టర్ ఉమా ప్రవల్లిక హాజరై అవసరమైన పరీక్షలు నిర్వహించి, మందులు, కళ్లద్దాలు ఉచితంగా అందజేశారు. అనంతరం డాక్టర్ శ్రీప్రభ క్యాన్సర్ వ్యాధికిగల పలు అంశాలపై ప్రసంగించారు.

స్టడీ మెటీరియల్‌తో పదో తరగతి విద్యార్థులు

ప్రజాశక్తి ఆధ్వర్యాన..
టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని వెంకోజీపాలెం, అంజయ్యనగర్ ప్రాంతంలోని పదో తరగతి విద్యార్థులకు ప్రజాశక్తి ఆధ్వర్యాన ఆదివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ స్టడీ మెటీరియల్‌ను యుటిఎఫ్ రూపొందించింది. కార్యక్రమంలో సిపిఎం ఏరియా నాయకులు కోదండ, చంటి, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం, విశాఖపట్నం జిల్లా.
ఆర్.సి.నెం: సి3/10/2022, తేది.04.03.2023 Phone No: 9885054588,9160969755

బహిరంగ వేలం ప్రకటన

శ్రీస్వామి వారికి చెందిన కొండ దిగువ వేపగుంట గ్రామం తోటల ఫలసాయం మరియు శ్రీ స్వామి వారి అనుభందంలో ఉన్న మాధవధారా నందు తోటలు ఫలసాయాన్ని అప్పగింత తేది నుండి మూడు సంవత్సర కాలపరిమితికి అనుభవించు హక్కునకు తేది.15.03.2023 ఉదయం 11:00లకు కొండ దిగువ విజయరామరాజు కళ్యాణ మండపము నందు బహిరంగ వేలము నిర్వహించబడును.

సం/-వి.త్రినాధరావు
కార్యనిర్వాహణాధికారి

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD

O.S.NO.1079 OF 2022

Between:
Union Bank of India, (erstwhile Andhra Bank merged in UBI) Credit Card Division, Koti, Hyderabad, represented by the Senior Manager (Law)
....Plaintiff

AND

Sri TamarlaBorrayya Naidu, S/o. Sri T. Demudu, aged about 38 years, R/o. 4-17/1, Near Elementary School, Talarivaripalem, Aganampudi, Vishakhapatnam- 530 046.
....Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery ofRs.3,21,476-68Ps (Rupees Three lakhs twenty one thousand four hundred and seventy six and paise sixty eight only) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and the same stands posted to 14-04-2023 for your appearance in person or through duly appointed Advocate at 10-30A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5,
West Prasanthnagar Colony,
Moosarambagh, Hyderabad-500 036

మహారాజశ్రీ పాలకొండ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S. No. 27/2022

Between:
యెచ్చర్ల రాజారావు ....వాది
And:
ఎచ్చర్ల విమలమ్మ and 4 others ....ప్రతివాదులు

నోటీసు

To,
1. ఎచ్చర్ల విమలమ్మ, భర్త లేటు అప్పలనాయుడు, 70 సం॥, హిందూ, విశ్రాంతి టీచర్ (Retired Teacher) R/o LIG 92, సెక్టర్ – V, H.No. 1-94-10, M.V.P. Colony, విశాఖపట్నం.
2. ఎచ్చర్ల భాను ప్రసాదరావు, S/o లేటు అప్పల నాయుడు, 35 సం॥, ప్రైవేటు ఉద్యోగి, rest do.
3. ఎచ్చర్ల రాజగోపాలరావు, S/o లేటు అప్పల నాయుడు, 32 సం॥, Software Engineer, rest do.
4. బుగత పద్మజ, W/o గోపాలరావు, 40 సం॥ హిందూ, M.D.O, rest do.
5. తుమ్మి శ్రీలత, W/o రాజ్‌కుమార్, 28 సం॥, గృహిణి, R/o Plot No. 38, Sector - VIII, LBG Colony, విశాఖపట్నం.

యిందలి వాది, ప్రతివాదులు పైన మం॥ పాలకొండ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో O.S. 27/2022 నంబరు గల దావా దాఖలు చేసి వున్నారు. యిందు విషయమై ప్రతివాదులు అయిన మీకు ఎట్టి ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారు ద్వారాగాని **తే 16-03-2023దీని పగలు గం 10-30 ని॥లకు** పై కోర్టుకి హాజరై మీ ఆక్షేపణలను తెలియచేసుకోవలెను. లేని ఎడల ప్రతివాదులకి ఎట్టి ఆక్షేపణలు లేవని మీ పరోక్షమందు తీర్మాణింపబడునని యిందుమూలంగా ప్రకటించడమైనది.

K.ఆనందుకుమార్
వాది తరుపున న్యాయవాది
పాలకొండ, పార్వతీపురం మన్యం జిల్లా
సెల్ : 9701937162

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు సంబంధించి జిల్లా పరిషత్, జివిఎంసి ఉన్నత పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలుపై హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. ఏ సబ్జెక్ట్‌లో వెనుక బడి ఉన్నారనేది నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎ, బి, సి గ్రేడ్లుగా విభజించి అందుకు అనుగుణంగా విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నారు.

వంద రోజుల ప్రణాళిక అమలుపై దృష్టి

ప్రిపరేటరీ పరీక్షల్లో వచ్చిన మార్కులు ఆధారంగా గ్రేడ్లు నిర్ణయిస్తున్నారు. 61-100 మార్కులు వచ్చిన వారిని "ఎ" గ్రేడ్ గాను, 41 నుంచి 60 మార్కులు వచ్చిన వారిని "బి" గ్రేడ్ గాను, 1-40 మార్కులు వచ్చిన వారిని "సి" గ్రేడ్ గాను విభజిస్తున్నారు.

వీటన్నింటి వెనుక టెన్త్‌లో శత శాతం ఫలితాలే లక్ష్యంగా ఉంది. దాదాపు అన్ని ఉన్నత పాఠశాలల్లోనూ 2022 నవంబర్‌లోనే సిలబస్ పూర్తి కావచ్చింది. అదే ఏడాది డిసెంబర్ నుంచి టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాధారణంగా పాఠశాలల పని వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాగా, విద్యా శాఖ ఆదేశాల మేరకు ఉదయం 8-15 నుంచి 9.15 సాయంత్రం 4.15 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతులు మంచి ఫలితాలనే ఇస్తున్నట్లు అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు అభిప్రాయ పడుతున్నారు.

ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు

ప్రత్యేక తరగతులతో మంచి ఫలితాలు

ప్రత్యేక తరగతులు మంచి ఫలితాలనే ఇస్తున్నాయి. జివిఎంసి రూరల్ పరిధిలో 21 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 1200 మంది టెన్త్ విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటికే విద్యార్థులను గ్రేడ్ల వారీగా విభజించి, వెనుక బడిన సబ్జెక్ట్‌ల్లో ఆయా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు.

కెవి.బాలామణి
ఎంఇఒ
భీమిలి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ సౌజన్యంతో ఆదివారం ముడసర్లోవ రోడ్డు స్కిల్ డవలెప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ వద్ద నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆరిలోవ కాలనీ, దీనదయాల్‌పురం, పెదగదిలి, చినగదిలి పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన స్థానికులకు డాక్టర్ పి.శ్రీధర్, డాక్టర్ డి.వాణి సారధ్యంలో నెఫ్రాలజీ, యూరాలజీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు, వాకర్స్‌కు, స్థానికులతో యూరాలజీ, నెఫ్రాలజీ రోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు వైసిపి అధ్యక్షుడు కెల్ల సత్యనారాయణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి, కార్యదర్శి ఈశ్వర్రావు, కోశాధికారి నాయుడు, శంకర్రావు, పిల్లి వీర్రాజు, మోహన్‌రావు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమ పిల్లలకు అల్పాహారం

ప్రజాశక్తి -ఆనందపురం : జై జవాన్ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బోయపాలెంలో 30 మంది పేద పిల్లలకు, వృద్ధులకు అల్పాహారం ఏర్పాటుచేశారు. బోయపాలెంలో ఉన్న మెర్సీ ఫౌండేషన్ అనాథాశ్రమంలో 30 మంది పిల్లలకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు కుప్ప రామలక్ష్మి మాట్లాడుతూ, ఆనందపురంలో జై జవాన్ ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు ఏంతో సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్ సేవ కార్యక్రమంలో అండగా ఉంటున్న ప్రతి ఒక్కరికీ దన్యవాదాలు తెలిపారు. ముందుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, సెక్రెటరీ ముడసల కార్తీక్, ట్రెజరర్ కుప్ప రామలక్ష్మి, ఇమంది శ్రీనివాసరావు, మెంబర్స్ కుప్ప శ్రీను, కుప్ప అప్పారావు, చుక్క గణేష్, లోకేష్, ఆనంద్, రాము, శ్రీను, కుప్ప రాజకుమార్, సంతోష్, రాము, కుప్ప దుర్గారావు, నర్సింగరావు, వంశీ, దివాకర్, రాజు, రమేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అనంతుని తెప్పోత్సవం

అనంతపద్మనాభస్వామి తెప్పోత్సవం....

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి తెప్పోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. 60సంవత్సరాల తర్వాత స్వామి వారి తెప్పోత్సవ కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా పూర్తిచేశారు. ఈ ఎడాది వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా దేవాదాయ-దర్మాదాయ శాఖ ఆధ్వర్యాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెప్పోత్సవ కార్యక్రమాన్ని శ్రీదుర్గా మహాపీఠాదిపతి శ్రవణచైతన్యానంద చిన్నస్వామి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభించారు. అనంతపద్మనాభ స్వామి ప్రాంగణంలో ఉన్న కుంతీమాధవస్వామి అలయంలో ఉన్న ఉత్సవ విగ్రహలను పల్లకిలో పెట్టి ప్రధాన అర్చకులు సీతారామాంజనేయులు మంత్రోచ్ఛరణల మధ్య మంగళ వాయిద్యాలతో గాలి గోపురం నుంచి ఊరేగింపు చేశారు. శ్రీదేవిభూదేవి సమేతుడైన అనంతపద్మనాభస్వామి గాలి గోపురానికి తూర్పు దిశగా ఆర్ అండ్ బి రోడ్డులో పోలీస్ స్టేషన్ మీదుగా పద్మనాభం జంక్షన్‌కు ఊరేగింపు చేరుకుంది. కన్నయ్య కోనేరులో సిద్ధంగా ఉంచిన హంస వాహనంలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు ముందుగానే కన్నయ్య కోనేరుకు చేరుకున్నారు.

ఏర్పాట్లు ఇలా...

అనంతపద్మనాభస్వామి కొండకు దిగువన ఉన్న కుంతీమాధవస్వామి అలయం నుంచి రోడ్డుకిరువైపులా విద్యుత్ దీపాలంకరణ చేశారు. కన్నయ్య కోనేరుకు చుట్టూ గట్టు వేశారు. కోనేరులో నీరు లేక పోవడంతో నాలుగు మోటార్లతో నాలుగు రోజు పాటు నీటిని నింపారు. కోనేరు చుట్టూ విద్యుత్ లైట్లు ఏర్పాటుచేశారు. హంసవాహనాన్ని పూల మాలలతో అలంకరించారు. విజయనగరం జిల్లా చింతవలస గ్రామంలోని శ్రీవెంటేశ్వర అలయానికి చెందిన హంస వాహనాన్ని రప్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కంటుబోతు రాంబాబు, ఆలయ ఇఒ ఎస్.నానాజీబాబు, సర్పంచ్ తాలాడ పాప, ఎంపిటిసి సభ్యులు కంటుబోతు లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రంజిత్ భార్గవ్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

'శ్రీ చైతన్య'లో విద్యార్థుల కొట్లాట

ప్రజాశక్తి- ఆనందపురం : అనందపురం భీమిలి క్రాస్ రోడ్ సమీపంలో ఉన్న శ్రీ చైతన్య జెఇఇ కళాశాలలో విద్యార్థులు తీవ్రంగా కొట్టుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల మధ్య రూము మారే విషయంలో వివాదం ప్రారంభమైంది. అందులో కొంతమంది విద్యార్థులు గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. వారిలో పడాల సాయి, ఆర్నెపల్లి హరీష్, కాకర్ల చందు, కళ్లికొట్ట అజయ్, తెలంగాణ బాలు ఒక గ్రూపు గాను, బొబ్బిలి మోహన్, జడల జయప్రకాష్, పిట్ట కోటేశ్వరరావు, కౌశిక్, మోహన్ మరో గ్రూపుగానూ ఏర్పడి రూము మారే విషయంలో గొడవపడ్డారు. శనివారం రాత్రి ఆరు గంటల సమయంలో కళాశాల ప్రిన్సిపల్ కిరణ్ క్రాంతి విషయం తెలుసుకొని విద్యార్థులకు సర్ది చెప్పి పంపించారు. రాత్రి 11:30 గంటల సమయంలో రెండు గ్రూపుల విద్యార్థులు కర్రలతో కొట్టుకున్నారు. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారు ఉజ్వల హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో జడల జయప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

గాయాలుపాలైన విద్యార్థులు

బిజినెస్ కాన్‌క్లేవ్‌లో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

పారిశ్రామికవేత్తలు సహకారం అందించాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి -మధురవాడ : పారిశ్రామిక వేత్తలు, ముఖ్యంగా దేశ కార్పొరేట్ రంగం సామాజిక బాధ్యతగా సమాజానికి ఇతోధికంగా సహకారం అందించాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయడు పిలుపునిచ్చారు. విశాఖలోని ఐటి హిల్‌పై ఫ్లూయంట్ గ్రిడ్ సంస్థ ఆవరణలో ఆదివారం జరిగిన కార్పొరేట్ కనెక్షన్స్ బిజినెస్ కాన్‌క్లేవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. రానున్న కాలంలో ప్రపంచంలోనే తృతీయ బలమైన ఆర్థిక శక్తిగా ఎదగనుందని పేర్కొన్నారు. అమెరికా తరువాత స్టార్టప్‌ల సంఖ్య మన దేశంలోనే అధికంగా ఉందన్నారు. భారతీయ సమాజం మేధోపరంగా ప్రపంచంలో ఉన్నత స్థానంలో ఉందని, నూతన విద్యావిధానం అందుకు ప్రోత్సాహం కలిగించే దిశలో ప్రయాణిస్తోందని చెప్పారు. ఈ ఏడాది దేశంలో జరగనున్న జి20 సమావేశాలలో భారతదేశం పర్యావరణం, ఆర్థిక నేరగాళ్ళ అప్పగింత వంటి అంశాలతో పాటు వసుదైక కుటుంభం నినాదాన్ని ప్రపంచానికి చాటాలన్నారు.

సంపద పెంచకుండా పంచుకుంటూ పోతే అనర్థమే

సంపద పెంచుకోకుండా పంచుకుంటూపోతే అనర్థాలకు దారితీస్తుందన్నారు. అప్పులకు వడ్డీలు కట్టడంతోనే సరిపోతుందన్నారు. అవసరార్థులకు చేయి అందించాలి తప్ప భుజం ఎక్కించి మోయకూడదని పేర్కొన్నారు. సమాజంలో శాంతిని పెంపొందించాలని, వ్యాపారంలో సహితం నైతిక విలువలు పాటించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివి.సోమయాజులు మాట్లాడుతూ, ఆర్థిక ప్రగతితో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యతతో పారిశ్రామికవేత్తలు వ్యవహరించాలన్నారు.

ఆసుపత్రిని ప్రారంభంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయ నిర్మల

డెంటల్ కేర్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌లో డాక్టర్ కందూరు అమూల్య నెలకొల్పిన శ్రీ డెంట్ కేర్ ఆసుపత్రిని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మలతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, దంత సమస్యలతో చాలా మంది బాధ పడుతున్నారన్నారని, సరైన జాగ్రత్తలు పాటించక పోవడంతో ఈ సమస్యలు అధికమవుతున్నాయని చెప్పారు. ఆరిలోవ ప్రాంత ప్రజల సౌలభ్యం కోసం డాక్టర్ అమూల్య ఈ డెంటల్ కేర్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సారిపిల్లి గోవిందు, కెల్లా సునీత, వైసిపి సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి చెందిన అప్పల కృష్ణారెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో హాస్పిటల్ ఖర్చులు నిమిత్తం రూ.50 వేల చెక్కును భీమిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల అందజేశారు. జనసేన కుటుంబాలకు భరోసా కల్పించేలా, ప్రమాదవశాత్తు గాయపడిన వారిని ఆదుకునేందుకు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రారంభించిన క్రియాశీల సభ్యత్వం ద్వారా ఈ మొత్తాన్ని అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాఖరి శ్రీనుబాబు, అనీల్, సాగర్, మూర్తి, సుబ్బు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బంటా కాలనీలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గ్యాస్ భారంపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-పెందుర్తి : గ్యాస్ పెంపుదలను నిరసిస్తూ జివిఎంసి 92వ వార్డు పరిధి బంటా కాలనీలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి రమణి మాట్లాడుతూ, కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజలపై భారాలు వేసే పనిపెట్టుకున్నారని విమర్శించారు. పెట్రోలు, డీజిల్ ధరలను రోజూ పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం అంచెలంచెలుగా గ్యాస్ ధరను పెంచుతూ ప్రజల నెత్తిన భారాలు వేస్తోందన్నారు. బిజెపి ప్రభుత్వానికి అదాని ఆస్తులు పెంచడంలో ఉన్న శ్రద్ధ ప్రజలు, కార్మికులపై లేదన్నారు. రానున్న కాలంలో బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలనాయుడు, ఐద్వా నాయకులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ ఆల్ షాప్ విభాగం ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- ములగాడ : యారాడలో షిప్‌యార్డ్ ఆల్ షాప్ విభాగం సిబ్బంది ఆత్మీయ కలయికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందుస్థాన్ షిప్ యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, ఆల్ షాప్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ ప్రకాసులు మాట్లాడుతూ, నిత్యం పని ఒత్తిడిలో ఉండే కార్మికులు ఇలాంటి ఆత్మీయ కలయిక ద్వారా ఎంతో ఆనందాన్ని పొందుతారని పేర్కొన్నారు. కోవిడ్ కారణంగా ఇటువంటి కార్యక్రమాలకు దూరం కావాల్సి వచ్చిందని తెలిపారు. మరలా ఇటువంటి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ, క్రికెట్ తదితర క్రీడలు నిర్వహించారు. యూనియన్ ప్రతినిధులు హరిరామచంద్రరావు, వీరబాబు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో ఎసిపి వివేకానంద

80 మంది రక్తదానం

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక కళిగొట్ల స్విగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఇక్కడి చిన బజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన 7వ రక్తదాన శిబిరంలో 80 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ఎండాడ దిశ పోలీస్ స్టేషన్ ఎసిపి సిహెచ్.వివేకానంద, స్థానిక సిఐ కె.లక్ష్మణమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదాన శిబిరం నిర్వహించిన ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తిని అభినందించారు. ఎన్‌ఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ వైద్యులు, సిబ్బంది సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్ మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

గోపాలపట్నం: జివిఎంసి 92వ వార్డు పరిధి సంతోష్‌నగర్‌లో కళింగ వైశ్య సేవా సంఘం ఆధ్వర్యాన ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మధుసూదన్‌రావు మాట్లాడుతూ, 12 సంవత్సరాలుగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, చాలా మంది స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు 100 యూనిట్ల వరకు రక్తం సేకరించినట్లు పేర్కొన్నారు. రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గణేష్, కుమార్, రాధ, కోశాధికారి మీనారావు, సెక్రటరీ ఎం.కనకరాజు, జగదీష్, కమిటీ సభ్యులు కృష్ణ, చక్రపాణి, నందిని, రాజేష్, సంతోష్, అనిల్‌కుమార్ వి.జైరామ్, జంబలి సురేష్, జాగృతి మహిళా సంఘం సభ్యులు రాధ, లక్ష్మి, నందిని తదితరులు పాల్గొన్నారు.

అందినంత దూరంలోనే కరెంటు తీగలు

ఆందోళనలో ప్రజలు
పట్టించుకోని విద్యుత్ శాఖ

ప్రజాశక్తి -కంచరపాలెం : బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా 57వ వార్డు పరిధిలోని ఐటిఐ జంక్షన్ ప్రధాన రహదారి గణేష్‌నగర్‌లో ఇళ్లకు దూరంగా ఉన్న విద్యుత్ వైర్లను ఇంటికి తగిలిస్తూ వేయడంతో ప్రజలు నాటి నుంచి ఆందోళనకరంగానే జీవిస్తున్నారు. అప్పట్లో రోడ్డు పక్కన పెద్ద మురుగు కాలువలను నిర్మించారు. కాలువలను ఆనుకుని ఉన్న ఇళ్ల మధ్య గుండా హెచ్‌టి విద్యుత్ లైన్లను వేశారు. రెండు మూడు అంతస్తులు ఉన్న ఇళ్లను ఆనుకుంటూ వేసిన ఈ విద్యుత్తు లైన్లలో వైర్లు భవనాల పై అంతస్తులను తాకేలా వెళ్లాయి. వీటికి కనీసం రక్షణ తొడుగులు కూడా ఏర్పాటుచేయలేదు. చిన్నపిల్లలకు సైతం అందినంత దూరంలో విద్యుత్ లైన్లు ఉండడంతో ఏ క్షణాన ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుదాఘాతంతో ప్రాణాలకు ప్రమాదం అని తెలిసినా.. ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

గణేష్‌నగర్, ఐటిఐ జంక్షన్ ప్రాంతంలో విద్యుత్ లైన్లు ఒక్కోచోట ఒక్కోలా వేశారు. రోడ్డుకు అటువైపు కొన్ని, ఇటువైపు కొన్నింటిని వేసి స్థానికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై జీవిఎంసీ, ట్రాన్స్‌కో అధికారులు సమన్వయంతో పరిశీలించి విద్యుత్ లైన్లను దూరంగా ఏర్పాటుచేయాలని, లేకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు కరెంటు తీగల తో ప్రాణహాని లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ పనులలో అప్పట్లో ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలను అన్ని ప్రాంతాల్లో కాలువలకు వెలుపలకు ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో మాత్రం కాలువలకు లోపల వైపు ఏర్పాటుచేశారు. దీనిపై అప్పట్లో గ్రామస్తులమంతా ఆందోళన చేపట్టినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా పనులు కానిచ్చి వెళ్ళిపోయారు. స్థానికులు అప్పటి నుంచి అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎంపీ విజయసాయిరెడ్డి ఈ మార్గం గుండా పాదయాత్ర చేస్తున్న సమయంలోను గ్రామస్తులంతా ఆయనకు వినతి పత్రం అందజేసి గోడు వినిపించుకున్నారు. అయినప్పటికీ ఏ ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు దృష్టి సారించి త్వరతగతిన సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని గణేష్ నగర్ గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్లకు ఆనుకొని ఉన్న విద్యుత వైర్లు

విలువలతో కూడిన విద్యతోనే భవిష్యత్తు

ఎమ్మెల్యే నాగిరెడ్డి

డి లిటిల్ స్టార్స్ స్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి -గాజువాక : విలువలతో కూడిన విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి శివాడ గ్రౌండ్‌లో డి లిటిల్ స్టార్స్ పే స్కూల్ ఆరో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పిల్లలు ప్రయోజకులు కావాలని పాఠశాల యాజమాన్యంపై నమ్మకం పెట్టుకొని తల్లిదండ్రులు ఎంతో శ్రమించి, ఫీజులు కట్టి చేర్పిస్తున్నారని తెలిపారు. పిల్లలకు క్రమశిక్షణ, అంకితభావంతో విద్యను నేర్పితే స్కూలు యాజమాన్యానికి తల్లిదండ్రులు ఎంతో కృతజ్ఞతలు తెలుపుతారని చెప్పారు. డి లిటిల్ స్టార్ పాఠశాల అంచలంచెలె ఎదుగుదలకు కారణమైన చిట్టి సునీత విశిష్ట సేవలను అభినందించారు. ఎం.సునీత మాట్లాడుతూ, పెద్ద విద్యార్థుల కంటే ప్రీ స్కూలు పిల్లలను తీర్చిదిద్దడం చాలా కష్టమన్నారు. పాఠశాల విద్యార్థులు ఎంతో జనరల్ నాలెడ్జితో విజ్ఞానవంతులయ్యారని తెలిపారు. రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే పిల్లలకు విద్యతోపాటు డ్యాన్సులు, క్రీడలు నేర్పించడం పట్ల పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ చిట్టి సుజాత పాఠశాల వార్షిక రిపోర్టును చదివి వినిపించారు. పాఠశాల కన్వీనర్ పి.కమల్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉక్కునగరం డిపాల్ స్కూల్ ప్రిన్సిపాల్ జాన్సన్ జాకోబ్, లైఫ్ కోచ్ వక్త అలజంగి ఉదయ్‌కుమార్, ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, అనిత, వందన, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -ములగాడ : సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జిని మూసివేస్తున్న కారణంగా పక్కనే ఉన్న ఎన్‌బిసి వంతెనపై నుంచి ప్రజా వాహనాల రాకపోకలకు అనుమతించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను ప్రజలు విజయవంతం చేయాలని సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ పిలుపునిచ్చింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ బ్రిడ్జిను మూసి వేస్తామని పోర్టు, నేవల్ అధికారులు ప్రకటించారని, దీన్ని మూసివేస్తే పారిశ్రామిక ప్రాంతం నుంచి నగరానికి పనుల నిమిత్తం వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపింది. ఈ బ్రిడ్జి మరమ్మతులు పూర్తయ్యే వరకు పక్కనే ఉన్న ఎన్‌బిసి వంతెనపై రాకపోకలకు అనుమతించాలని సిపిఎం ఆధ్వర్యాన పలు రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొంది. అందరికీ సంబంధించి అంశమని, ప్రతి ఒక్కరూ స్పందించి ధర్నాకు హాజరుకావాలని కోరింది.

విద్యాహక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని బాల వికాస ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి నరవ ప్రకాశరావు డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో ప్రయివేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో మొదటి తరగతిలో పేదల పిల్లలకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని విద్యా శాఖ జారీ చేసిన జిఒ 24పై వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆదివారం ఎల్‌బి.కాలేజీ ప్రాంగణంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బాల వికాస ఫౌండేషన్, రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరమ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన సమావేశంలో నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, విద్యా హక్కు చట్టం అమలులో ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తోందన్నారు. అయితే చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్ ఆచార్య వై.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రయివేటు పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయింపునకు జిఒ జారీచేయడంపై హర్షం వ్యక్తంచేశారు. అమలులో చిత్తశుద్ధి అవసరం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో హాజరు తక్కువై డ్రాప్ అవుట్స్ ఎక్కువ కావడంపై ఆ ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ గౌరీ శంకర్, డాక్టర్ అబ్దుల్ బే గ్, నరసింహారావు, హరగోపాల్, తిరుపతి నుంచి వచ్చిన మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక ఆర్య వైశ్య సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గాజువాక మండల ఆర్యవైశ్య అధ్యక్షులుగా గునిశెట్టి అప్పల సత్యనారాయణగుప్తా, ప్రధాన కార్యదర్శిగా కారుమూరి రామకృష్ణ, కోశాధికారిగా కట్ట సత్యానందం, గంట్యాడ మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా రామారావు, కోశాధికారిగా చెరుకూరి వెంకటరమణ ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నున్న మహేష్, గుంపిన రఘునాథ గుప్తా, కొలుకూరు మంగరాజు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

గాజువాక పిహెచ్‌సిని సందర్శించిన సెంథిల్ కుమార్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తమిళనాడుకు చెందిన హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సెంథిల్ కుమార్ ఆదివారం సందర్శించారు. హాస్పిటల్‌లో ప్రతి గదినీ పరిశీలించారు. హాస్పిటల్లో అందుతున్న సేవలపై వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఫ్యామిలీ కాన్సెప్ట్ అమలు జరుగుతున్న తీరును అభినందించారు. ఆయనతోపాటు డిఎంహెచ్ఓ జగదీశ్వరరావు, ఇతర అధికారులు, గాజువాక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.

చెరుకు రైతులతో చెడుగుడు..!

- ఫ్యాక్టరీలో సమస్యలతో క్రషింగ్‌కు అంతరాయం
- చెరుకు సరఫరా సాగక కాటాల వద్ద పడిగాపులు
- ఎండిపోతున్న పంటతో రైతులకు తీవ్ర నష్టం
- రోజుల తరబడి ఇదే పరిస్థితి.. పట్టని యాజమాన్యం
- గిట్టుబాటు కాక సాగుదారుల దిగాలు

కాటాల వద్ద పదిరోజులుగా తూకం జరగక ఎండలోనే ఉన్న చెరుకు వాహనాలు, బళ్లు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరుకును సరఫరా చేసే రైతులకు ఈ సీజన్‌లో సమస్యలు, కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి.ఈ సీజన్‌లో ఆది నుంచి రైతుల కష్టాలు కొనసాగుతున్నారు. ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిచిపోవడంతో చెరుకు సరఫరాలో అవాంతరాలు తప్పడం లేదు. ప్రస్తుతం చెరకు సాగుకు అయ్యే ఖర్చుతో పోలిస్తే, గిట్టుబాటు కాని ధరలతో ఒకవైపు సతమతమౌతున్న రైతులకు, ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిచిపోవడంతో చెరుకు కాటాల్లో వారం, పదిరోజుల పాటు వాహనాల్లోనే చెరుకు బళ్లవాహనాల్లో ఉండి పోవడంతో అవికాస్తా ఎండి , బరువు తగ్గి నష్టపోయే పరిస్థితి ఉందని వాపోతున్నారు. రోజుల తరబడి

ఈ సీజన్‌లో గోవాడ చక్కెర కర్మాగారం తరచూ మరమ్మతులకు గురికావడంతో రైతులు సరఫరా చేసిన సరకు కాటాల వద్దే పడిగాపులు పడుతోంది. చెరకు తూనిక కాకుండా వారం, పది రోజులపాటు, తూనిక కేంద్రాలలోనే నిలిచి పోతుండడంతో చెరకు ఎండి, బరువు తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. మండలంలో బుచ్చయ్యపేట, వడ్డాది,చెరకు తూనిక కేంద్రాల ద్వారా గోవాడ చక్కెర కర్మాగారానికి చెరకున సరఫరా చేస్తున్నారు. గోవాడ చక్కెర కర్మాగారంలో ఈ సీజన్లో ఇప్పటికే పలుమార్లు మరమ్మతులకు గురై క్రషింగ్ సాఫీగా సాగడం లేదు. చక్కెర కర్మాగారం నుండి సరఫరా చేసిన చెరకుకు సకాలంలో డబ్బులు చెల్లించక, పండిన పంటకు తగిన గిట్టుబాటు ధర లేక దిగాలుగా ఉన్న రైతులకు ఈ కొత్త సమస్య ఆశనిపాతంగా మారింది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది చెరకు సాగు బాగా తగ్గిందని రైతులు అంటున్నారు. చెరకు నరికివేత నుంచి వాహనాల్లోకి చెరకు ఎత్తే వరకు పనులన్నీ చేయడానికి నాలుగైదు రోజుల సమయం పడుతోందని, ఈలోగా పొలాల్లోనే చాలా వరకు చెరకు ఎండిపోతోందని రైతులు అంటున్నారు. తీరా నాటుబళ్లు, ట్రాక్టర్లు, లారీల్లో తూనిక కేంద్రానికి చెరకు తరలించిన తర్వాత అక్కడ మరో వారం పదిరోజులు పాటు ఎండలోనే ఉండిపోవడంతో మరింత ఎండిపోతోంది.

బుచ్చయ్యపేట చెరకు తూనిక కేంద్రానికి, బుచ్చయ్యపేట ఐతంపూడి కేపీ.అగ్రహారం కొండపాలెం, గున్నెంపూడి, పి.భీమవరం, దిబ్బిడి పోలేపల్లి, చిన్నమదిన, పెద్దమదీనా, సరఫరా అవుతుంది. అవడ్డాది చెరకు తూనిక కేంద్రానికి, వడ్డాది వీరవల్లి ముకుందపురం, బంగారు మెట్ట లోపూడి,ఎల్.సింగవరం పొట్టి దరపాలెం, బుదిరెడ్డపాలెం తదితర గ్రామాల నుండి చెరకు సరఫరా చేస్తారు. ట్రాక్టర్లు మరియు టైరు బళ్ల ద్వారా చెరకు తీసుకొస్తున్నారు. అయితే ఇపుడు ఫ్యాక్టరీలో క్రషింగ్ సాఫీగా సాగకపోవడంతో దాదాపు పది రోజుల వరకు చెరకు తూనిక కేంద్రాల వద్ద బళ్లు, వాహనాల్లోనే అలాగే ఉండిపోతోందని రైతులు వాపోతున్నారు. రోజుల తరబడి చెరకుతో ఉన్న వాహనాలకు అద్దె తడిసి మోపెడౌతుంటే, మరోవైపు చెరకు ఎండిపోయి, బరువు తగ్గడంతో తూకంలో తేడాతో మరోవిధంగా నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చెరకు సాగు అంటేనే భయపడే పరిస్థితులను కల్పించడం విచారకరమని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రెంటికీ చెడిపోయాం...

ఫ్యాక్టరీకి చెరుకు సరఫరాలో నెలకొన్న ఇబ్బందులతో రైతులకు నష్టం తప్పడం లేదు.నాలుగైదు రోజులు పొలంలో ఎండిపోయి, ఇపుడు కాటాల వద్ద పదిరోజులపాటు కాటాల వద్ద ఉండిపోవడంతో చెరకు ఎండిపోతోంది. అసలే ధరలేదు. ఇపుడు ఎండి బరువు తగ్గడంతో రెండువిధాలుగా రైతు నష్టపోతున్నాడు.

దొంకిన రాము, రైతు, బుచ్చయ్యపేట

కాటాల వద్ద పడిగాపులు

రైతు పొలం నుంచి చెరుకును ఐదు రోజుల క్రితం బుచ్చయ్యపేట కాటాకు తీసుకొచ్చాను. ఇంకా తూకం కాక పోవడంతో పడిగాపులు పడుతున్నాను. చెరుకును తెచ్చేందుకు టన్నుకు రైతు రూ.800 ఇస్తారు. ఇలా రోజుల తరబడి ఇక్కడే ఉండిపోవడంతో కూలీ సైతం గిట్టుబాటు కావడం లేదు.

- కంచిపాటి నాగేశ్వరరావు, ట్రాక్టర్ డ్రైవర్, దిబిడి

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కూచిపూడి నృత్య కళాకారిణి ఆముక్త మాల్యదకు సన్మానం

ప్రజాశక్తి -నక్కపల్లి : ఉపమాక క్షేత్రంలో వెంకన్న కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరిస్తున్నాయి. నక్కపల్లి మండలంలోని ఉపమాక, వేంపాడు, జానకయ్యపేట తదితర ప్రాంతాల్లో కోలాటంలో శిక్షణ పొందిన బాలికలతో పాటు, జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాలకు చెందిన మహిళా కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. విజయనగరం జిల్లా గరివిడికి చెందిన కూచిపూడి కళాకారిణి ఆముక్త మాల్యద చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది .ఆమెకు గురుభవానీ పీఠం తరపున శాలువా కప్పి , దుర్గాదేవి అమ్మవారి జ్ఞాపిక అందజేసిసత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత తెలుగు పండితురాలు డాక్టర్ గాయత్రి దేవి, ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాద్ ఆచార్యులు, అర్చకులు కష్టమాచార్యులు, శేషాచార్యులు, శివాలయం చైర్మన్ చెరుకూరు వెంకటేశ్వరరావు, గురు భవాని దవరసింగి రాంబాబు, నక్కపల్లి హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు సన్యాసిరావు, గ్రామస్తులు గోర్స శ్రీనివాస్ పాల్గొన్నారు

అ'పూర్వ' కలయిక

46 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం జూనియర్ కాలేజీలో 1977బ్యాచ్ ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం చోడవరంలోని ఒక కల్యాణమండపంలో నిర్వహించారు.46 ఏళ్ల కిందట తాము చదువుకున్న నాటి రోజుల్లోని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి బ్యాచ్‌లోని పలువురు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు చేసి రిటైర్ అయ్యారు. ఇలా వారంతా ఒక్కచోట కలుసుకుని నాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. పరస్పర యోగసమాచారం తెలుసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఎవిఎస్ ప్రసాద్, మాజీ ఎంపిపి జి వెంకట సత్యనారాయణ, రిటైర్డ్ ఇరిగేషన్ అధికారి కోవెల కోటేశ్వరరావు, న్యాయవాది గౌరీ శంకర్, సాంబ, గణేష్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- దేవరాపల్లి : స్థానిక వనదేవేశ్వర స్వామి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నసమారాధనలోనూ పాల్గొన్నారు. వనదేవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి కల్యాణం కనులపండుగగా సాగింది. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి చంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలో భారీగా పాల్గొన్న భక్తులు

ఉద్యోగులంటే జగన్‌రెడ్డికి కక్ష

మాట్లాడుతున్న గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉద్యోగులపై కక్షతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లేనిపోని విధానాలను తెస్తున్నారని, అందులో ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ యాప్ ఒకటని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మండిపడ్డారు. ఆదివారం గవరపాలెంలో జరిగిన ఆర్‌ఎంపి వైద్యుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన సిఆర్‌పి రద్దు హామీని అమలు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఒత్తిడి చేయడంతో వారిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్‌ను అమల్లోకి తెచ్చారన్నారు టిడిపి హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు వైసిపిని తిరస్కరించడం దాదాపు ఖాయమైపోయిందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ఆర్‌ఎంపి వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కమిటీ సభ్యులు వి సత్యనారాయణ, నారాయణరావు, కోశాధికారి బుద్ధ సోమేశ్వరరావు, అలంక బోగేష్, పీలా రామారావు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో నిందితులను శిక్షించాలి

జగనాసుర రక్త చరిత్ర పుస్తకావిష్కరణ బుద్ధ నాగజగదీష్

జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధ

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ మంత్రి వైఎస్.వివేకానంద రెడ్డి హత్య కేసులో అసలు దోషులను బయట పెట్టాలని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రింగ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివేకానందరెడ్డిని దారుణాతిదారుణంగా చంపిన కేసులో ఎంత పెద్ద వాళ్ళయినా, ఏ స్థాయిలో ఉన్నా వారికి చట్టపరంగా కఠిన శిక్ష పడకపోతే ఇంకా రెచ్చిపోయే ప్రమాదం ఉందన్నారు. వైసిపి జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రజల ధన మాన, ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తారు. సిబిఐ విచారణలో జాప్యం చేయకుండా దోషులను కోర్టు బోనులో నిలబెట్టాలన్నారు. ఇప్పటికే జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అరాచకత్వం పెచ్చురిల్లిపోయిందని, నేరస్తులు విచ్చలవిడిగా తిరుగుతున్నారని విమర్శించారు. వివేకా హత్య కేసులో దోషులను ఇప్పటికే సిబిఐ గుర్తించిందని, వారు జగన్ బంధువులేనని సూచాయగా స్పష్టమౌతోందన్నారు. వివేకా హత్యకేసులో అభియోగాలను తెలుగుదేశంపై మోపి రాజకీయ లబ్ధి పొందేందుకు నేటికీ వైసిపి మోసపూరిత ప్రచారాలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బిఎస్‌ఎన్‌కె. జోగినాయుడు, బొడ్డేడ మురళి, పొలిమేర నాయుడు, గుడాల సత్యనారాయణ, మారిశెట్టి శంకరరావు, సాలాపు నాయుడు, మల్ల గణేష్, బుద్ధ మహాలక్ష్మి నాయుడు, బుద్ధ భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కెప్టెన్ అప్పారావు వ్యక్తిత్వం ఆదర్శనీయం

ప్రజాశక్తి -అనకాపల్లి : సేవే పరమావధిగా భావించి సేవలందించే వారిలో కెప్టెన్ అప్పారావు ఒకరని మున్సిపల్ మాజీ చైర్మన్ కొణతాల జగన్నాధరావు నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక వివి రమణ రైతుభారతిలో కెప్టెన్ అప్పారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాధరావు నాయుడు మాట్లాడుతూ, చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన అప్పారావు ఆదర్శనీయ ఉన్నారు. తాను రిటైర్ అయినా వయోవృద్ధుల సంక్షేమానికి సంస్థను స్థాపించి, నేటికీ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజ భివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా అప్పారావుకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో హెల్ప్ లైన్ ప్రసాద్, విల్లూరి రాము, గంగుపాము నాగేశ్వరరావు, ఎఎంఎఎల్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సరగడం నూకరాజు, బివి రమణ అప్పారావు, కెవివి నారాయణరావు, రాపేటి నారాయణరావు, బొడ్డేడ అప్పారావు, మాజీ కౌన్సిలర్ కష్ణంరాజు, కే రమణ అప్పారావు, ఎం ఎన్ ఎస్ అప్పారావు, బుద్ధ అప్పారావు, కొణతాల నారాయణరావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కెప్టెన్ అప్పారావును సత్కరిస్తున్న పలువురు

కాంగ్రెస్ నేత సత్యనారాయణకు పరామర్శ

సత్యనారాయణను పరామర్శిస్తున్న కాంగ్రెస్‌నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న అనకాపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాళ్ల వెంకట సత్యనారాయణను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్, పార్టీ కశింకోట మండల అధ్యక్షులు మలపురెడ్డి కోటేశ్వరరావు తదితరులు ఆదివారం పరామర్శించారు.

మండలంలోని వెంకుపాలెం గ్రామంలో సత్యనారాయణ ఇంటికి వెళ్లి, యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, సూరిశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు.

పశువుల పాకలు దగ్ధం

మంటలను ఆర్పుతున్న స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు శివారు పొడుగుపాలెం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పశువుల పాకలు కాలి బూడిదయ్యాయి. చోడవరం అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందిన మడక రమణ, మడక గోవిందులకు చెందిన పశువుల పాకలతోపాటు, రెండు వరి ధాన్యం కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. అందిన సమాచారం మేరకు హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి, మంటలను అదుపు చేశామన్నారు. సుమారు రూ.1.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్వరమాలిక, నటరత్న కల్చరల్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఆదివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన సినీ సంగీత విభావరి ఉర్రూతలూగించింది. కార్యక్రమాన్ని విశ్రాంత అదనపు ఉప పోలీస్ కమిషనర్ మహమ్మద్ ఖాన్, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయకులు భయ్యా శ్రీనివాస్, ఆంజనేయ రెడ్డి, హేమంత్ అనేక హుషారైన గీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగాధర్, వెంకటేష్, గాయనీమణులు పేరీ గీత, రమణి, శైలజ, రేణుక, లావణ్య, లయ తదితరులు తమ గళ మాధుర్యంతో అలరించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా రాధారాణి వ్యవహరించారు.

మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆటో, మోటారు కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ డిమాండ్ చేశారు. అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో కాన్వెంట్ జంక్షన్ వెజిటెబుల్ మార్కెట్ ఆటో మోటార్ కార్మికులు, డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలపై నియంత్రణ ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ఎఫ్‌సి పర్మిట్, ఎల్ఎల్ఆర్ చలానా ఛార్జీలను రద్దు చేయాలన్నారు.

హక్కుల సాధనకు ఐక్యపోరాటం

సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘం నేతలు

ప్రజాశక్తి- కశింకోట : హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి యాదవులంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని యాదవ సంఘంజిల్లా అధ్యక్షుడు బాబూరావు పిలుపునిచ్చారు. ఆదివారం కశింకోటలో నిర్వహించిన మండల యాదవ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ, యాదవులంతా తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించడంపైనే దృష్టిసారించాలని సూచించారు. జిల్లా కార్యదర్శి కోరిక సోమునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంచదార సూరిబాబు, కశింకోట మండల వైస్ ఎంపిపి నమ్మి మీనా గణేష్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బంధం రమణ, వియ్యపు సింహాచలం, చోడవరం నియోజకవర్గ అధ్యక్షులు మొల్లి ప్రసాద్, అనకాపల్లి మండల అధ్యక్షులు పంచదార కన్నారావు, కొండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ కార్యవర్గం

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బాబూరావు సమక్షంలో మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. మండల యాదవుల సంఘం గౌరవాధ్యక్షులుగా పంచదార్ల, వెంకటరమణ, అధ్యక్షులుగా కరకరాజు, ప్రధాన కార్యదర్శిగా సారిపల్లి నానిబాబు, ఉపాధ్యక్షులుగా కొండల చంటి, కార్యదర్శిగా నమ్మి నర్సింగరావులనుఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

యోగాభ్యాసంతో ఆరోగ్యం

శంఖ ప్రక్షాళనలో పాల్గొన్న యోగ అభ్యాసకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : యోగాభ్యాసంలో శంఖ ప్రక్షాళన ద్వారా శారీరక ఆరోగ్యం పెంపొందుతుందని ఆరోగ్య ధాత్రి చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ సుందర్ పెరుమాళ్ళ, యోగ శిక్షకులు రమేష్, భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి అనకాపల్లి అధ్యక్షులు బిశెట్టి దొరమ్మ నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని కోడూరు ఆరోగ్యధాత్రి ఆయుర్వేద పరిశోధన కేంద్రంలో జార్జి క్లబ్ యోగాభ్యాస సాధకులకు పది రోజులపాటు శంఖ ప్రక్షాళనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాసాధనలో సాత్విక ఆహారం ద్వారా రక్త శుద్ధి చేసుకోవడం, అనంతరం సైంధవ జలం తాగుతూ శంఖ ప్రక్షాళన, ఆసనాల ద్వారా పేగులను ఆమూలాగ్రము శుద్ధి చేసే అతి ప్రాచీన ప్రక్రియ అన్నారు. పది రోజులపాటు కఠిన ఆహార నియమాలు పాటించడం ద్వారా శరీరంలో మాలిన్యాలను పూర్తిగా తొలగించవచ్చన్నారు. తద్వారా ఎన్నో శారీరక రుగ్మతల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు.

తూర్పు కాపుల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి -అనకాపల్లి : తూర్పు కాపుల సంక్షేమానికి రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పలక రాము, ఎడ్ల త్రినాధరావు అన్నారు. ఆదివారం స్థానిక వేమగిరి శ్రీసత్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద జిల్లా తూర్పు కాపుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన సంఘం వనసమారాధనకు సహకరించిన వారందరికీ కతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానించారు. సంఘం ఆదాయ వ్యయ వివరాలను కార్యదర్శి త్రినాధరావు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ జి.రామ్మూర్తి, అంటాకుల రత్నకుమారి, జిల్లా బిజెపి అధ్యక్షులుగా నియమితులైన ద్వారపురెడ్డి పరమేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం పూర్వ అధ్యక్షులు పాండ్రంగి సత్యారావు, కోరుకొండ సాంబశివరావు, పలక సత్యనారాయణ, గొన్నబత్తుల వెంకటరమణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, జాజుల రమేష్, సకల గోవిందరావు, పప్పల ఆదినారాయణ, మలపు రెడ్డి కోటేశ్వరరావు, మద్దాల కూర్మారావు, కర్రి బాబీ, పేరపు రాంబాబు, ఆర్టీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అతిథులను సత్కరిస్తున్న తూర్పుకాపు సంఘం నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఆర్ఒ శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి - సీతమ్మధార : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆదివారం స్వర్ణ భారతి స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లు, పోలింగ్ తరువాత మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరచడం, కౌంటింగ్ ఏర్పాట్లు గురించి అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అదే విధంగా కౌంటింగ్ సమయంలో ఎన్నికల పరిశీలకులకు, పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు, ఏజెంట్లకు, చేపట్టే సదుపాయాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. సిసి కెమెరాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ, కౌంటింగ్ సమయంలో సమాచారం ఏ విధంగా అందించాలి ? అనే విషయంపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, సింహాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, సూపరింటెండెంట్ రామారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి అభినందన

నాగప్పారావు, రవిలను అభినందిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రజాశక్తి-చోడవరం/ వడ్డాది : ఎపిఇపిడిసిఎల్ యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ నర్సీపట్నం డివిజన్ అధ్యక్షునిగా కనిశెట్టి నాగప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నర్సీపట్నంలో నిర్వహించిన యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాలుగవ మహాసభ సందర్భంగా డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నాగప్పారావు కార్యదర్శిగా కె.వెంకట రవికుమార్ ఎన్నికయ్యారు. వీరిద్దరిని నర్సీపట్నం డివిజన్ ఎలక్ట్రికల్ యూనియన్ ఎంప్లాయిస్ సభ్యులంతా పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. యూనియన్ నాయకులు భాస్కరరావు, వేపాడ సత్యనారాయణ, ప్రేమ చంద్రశేఖర్, బిఎంఎల్ నాయుడు, రమేష్ తదితరులు అభినందించారు.

విజ్ఞాన గని గ్రంథాలయం

-అందుబాటులో 25 వేలకు పైగా పుస్తకాలు -మహిళలకు ప్రత్యేక రీడింగ్ రూమ్ -బాలలకు చిల్డ్రన్స్ క్లబ్

.లైబ్రరీలో పుస్తకాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ వద్ద గల శాఖా గ్రంథాలయం పాఠకులకు విజ్ఞాన గనిగా మారుతోంది. పోటీ పరీక్షలకు అవసరమయ్యే కాంపిటీటివ్ బుక్స్, సాహితీ ప్రియులకు సాహిత్య పుస్తకాలు.. చిన్నారులకు బాలకవితలు, బాలశిక్షలు, పాఠకుల కోసం అన్ని రకాల దినపత్రికలు... ఇలా ఇక్కడ 25 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. లైబ్రేరియన్ దమయంతి చొరవ తీసుకుని జిల్లా గ్రంథాలయ అధికారులతోనూ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్, కార్యదర్శి ప్రోత్సాహంతో గ్రంథాలయానకు 1262 పుస్తకాలు ఏర్పాటు చేశారు. వీటిలో తెలుగు పుస్తకాలు 1072, ఇంగ్లీష్ 141, హిందీ 49 పుస్తకాలను సమకూర్చారు. పాఠకుల సంఖ్య పెరగడంతో విస్తతంగా పేపర్లు, బుక్స్ కొన్నారు. ఉద్యోగార్థుల కోసం స్పెషల్ పేపర్, కంప్యూటర్ సెక్షన్, రీడింగ్ హాల్ ఇలా దేనికది ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మహిళలకు ప్రత్యేక రీడింగ్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు. గతంలో పాత పుస్తకాలు మాత్రమే చదువుకునే అవకాశం ఉండగా. ఇప్పుడు లైబ్రరీకి వచ్చే వారు కోరుకున్న పుస్తకాలను సమకూర్చారు. డిమాండ్ రిజిస్టర్లో పాఠకులు, నిరుద్యోగులు తమకు అవసరమైన పుస్తకం పేరు రాస్తే వాటిని తెప్పించే విధంగా కృషి చేస్తున్నారు.ఇప్పటికే ప్రభుత్వం పలు ఉద్యోగాల ప్రకటన చేయడంతో రోజూ గ్రంథాలయానికి నిరుద్యోగుల తాకిడి పెరిగింది. ఉద్యోగార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో ప్రత్యేక బల్లలను ఏర్పాటు చేసి సౌకర్యాలను కల్పించారు. అభ్యర్థులు కూడా ఉద్యోగం సాధించాలనే తపనతో కష్టపడి చదువుతున్నారు. బాలలను ఆకర్షించే విధంగా ప్రతి ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహిస్తున్నారు. విద్యార్థుల మేధాశక్తిని పెంచేందుకు వినూత్న రీతిలో ఆటలు ఆడించడం, డ్రాయింగ్స్ వేయించి ప్రోత్సాహకంగా బహుమతులు ఇస్తున్నారు.

పుస్తకాలు చూపుతున్న లైబ్రేరియన్, పిల్లలు

లైబ్రరీలు చైతన్యం నింపుతాయి

ప్రజలలో చైతన్యం పెంచడానికి లైబ్రరీలు ఎంతో ఉపయోగపడతాయి. అందుకు అనుగుణంగానే విద్యార్థులకు, యువకులకు, పాఠకులకు పుస్తకాలను సమకూర్చడం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

పి.దమయంతి,
లైబ్రేరియన్

గురుకుల ప్రవేశాలకు
దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియేట్లో చేరేందుకు ఎస్సి, ఎస్టీ బిసి, ఒసిలకు చెందిన విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల, కళాశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రామకృష్ణ తెలిపారు. 4వ తరగతి పూర్తి చేసి 5వ తరగతికి వెళ్లే విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి 2023 పరీక్షల్లో ఉత్తర్ణత పొంది ప్రథమ సంవత్సరంలోకి వెళ్లే విద్యార్థులు నెల 24వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న ఉదయం 10 గంటలకు 5వ తరగతి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఐదో తరగతికి సంబంధించి ఎస్సీ 70, ఎస్టీ 5, బిసి 4, ఒసి 1 మొత్తం 80 సీట్లు ఉన్నాయని, ఇంటర్ ఎంపిసిలో ఎస్సీ 35, ఎస్టీ 3, బిసి 1 మొత్తం 40, ఇంటర్ బైపిసికి సంబంధించి ఎస్సీ 35, ఎస్టీ 2, బిసి 2, ఓసి 1 మొత్తం 40 సీట్లు ఉన్నాయన్నారు. మరెన్ని వివరాలకు ఫోన్: 8008001392కు సంప్రదించాలన్నారు.

నేడు మాకవరపాలెం మండల సమావేశం

ప్రజాశక్తి-మాకవరపాలెం:ఈ నెల 6న మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుణ శ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాల న్నారు. సర్పంచ్లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

దాతను సన్మానిస్తున్న గురు భవాని రాంబాబు

ఉపమాకలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయం వద్ద ఒక భక్తుడు ఉదార స్వభావంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కాకినాడ జిల్లా దుర్గాడ గ్రామానికి చెందిన జ్యోతుల భీమేశ్వరరావు తనయుడు శంకర్లు వెంకన్న కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయం వద్ద సుమారుగా 5000 మంది భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన దాత జ్యోతుల భీమేశ్వరరావు తనయుడు శంకర్‌కు ఉపమాక గురు భవాని పీఠం తరపున గురు భవాని దవరసింగి రాంబాబు సత్కరించి ,అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దవరసింగి సన్యాసిరావు (బాబ్జి), గ్రామస్తులు కొప్పిశెట్టి సత్యనారాయణ, గోర్ల శ్రీనివాసరావు, కక్కిరాల శ్రీను, కొప్పిశెట్టి చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల నాయుడును సన్మానిస్తున్న వీసం

డిప్యూటీ సిఎం బూడికి ఘన స్వాగతం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం విజయవాడ వెళ్తున్న డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడుకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీసం నానాజీ, తళ్ల భార్గవ్, సురేష్ వర్మ, వీసం రాజు, కొండ, సత్యనారాయణ, పాపారావు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ ఉద్యోగులపై నిర్లక్ష్యం చేస్తుందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షులు వేపాడ సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యుత్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు, ఎరియర్స్ సకాలంలో ప్రభుత్వం అమలు చేయడం లేదని, ఫలితంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యూనియన్ అడ్వైజర్ కే.భాస్కరరావు మాట్లాడుతూ, విద్యుత్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ సేవలను అందిస్తున్నారని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు డి.సత్తిబాబు మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకొని పెట్టుబడిదారులకు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తుందని తెలిపారు. ఫలితంగా విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కోలేదన్నారు. తన సొంత ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వానికి వంత పాడుతుందని విమర్శించారు. ఇదే కొనసాగితే రాష్ట్రంలో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థలన్నింటినీ తన ఆధీనంలో ఉంచుకోవాలని కోరారు.అనంతరం నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివ, చంద్రశేఖర్, జానీ, జయరాజు పాల్గొన్నారు.

రక్తదాతకు మెమెంటో అందజేస్తున్న సిఐ

50 మంది యువకుల రక్తదానం

ప్రజాశక్తి - కొత్తకోట:తాసుబిల్లి ఫౌండేషన్, మన యువత - మన అర్జా పురం సంయుక్త ఆధ్వర్యంలో అర్జాపురం గ్రామ సచివాలయం వద్ద ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, ఎస్ఐ విభూషణరావు, తాసుపల్లి ఫౌండేషన్ చైర్మన్ శంకర్ నాయుడు, గ్రామ సర్పంచ్, వైస్ ఎంపిపి భవానీ ప్రసాద్ తదితరులు ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ఒకరు చేసిన రక్తదానంతో ఇద్దరు ప్రాణాలను కాపాడవచ్చు అన్నారు. చదువుతో పాటు సేవా కార్యక్రమాలు యువత తరచూ నిర్వహించి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంకు బృందం సభ్యులు పాల్గొన్నారు.

చెర్లోపాలెంలో గ్యాస్ వాహనం

అధిక ధరలకు గ్యాస్ విక్రయాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:గోరుచుట్టుపై రోకలి పోటు అన్నట్టుంది గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల తీరు. ప్రధాని మోడీ పుణ్యామా అని గ్యాస్ ధర రోజు రోజుకి సామాన్యుడికి చుక్కలు చూపిస్తుంది. ఈ తరుణంలో నాతవరం మండలానికి చెందిన నవ్య ఇండేన్ గ్యాస్ ఏజెన్సీస్ ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయాలు చేపడుతున్నారు. ఇది చెర్లోపాలెం లో ప్రజాశక్తి కంట పడింది. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం సిలిండర్ ధర రూ.1118.50కు విక్రయించాల్సి ఉండగా ప్రస్తుతం నవ్య గ్యాస్ ఏజెన్సీస్ రూ.1160లకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి డొమెస్టిక్ గ్యాస్ వినియోగదారుడికి ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉంది. ఒక్కొక్కరి వద్ద నుండి దాదాపు రూ.42ల వరకు అదికంగా వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి సామాన్యుడికి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అందజేయాలని కోరుతున్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు కృష్ణ స్వరూప్

ప్రజాశక్తి-పాయకరావుపేట:మండలంలో పి.ఎల్. పురం గ్రామానికి చెందిన దళిత యువకుడు వడ్డమూరి నాగేంద్రను హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీం కోర్ట్ న్యాయవాది వడ్డమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. నిందితులను తప్పించడానికి పోలీస్ అధికార యంత్రాంగం, అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక పాత్రికేయులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ, మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, మూడు ఎకరాల వ్యవసాయ భూమి, కుటుంబం లోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. జగన్ పాలనలో దళితులకు రక్షణ లేదన్నారు. అమానుషం గా దాడులు చేసి హత్యలు చేస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం, అధికార పార్టీ శాసన సభ్యులు, ఎంపీ, మంత్రులు పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేసారు.నాగేంద్ర కుటుంబంకు న్యాయం జరిగే వరకూ పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు.

7న ఎపిడబ్ల్యుజెఎఫ్ సమావేశం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అనకాపల్లిలోని రోటరీ హాలు (రాజా థియేటర్ వెనుక) ఈనెల 7న ఉదయం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (APWJF) సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఆ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఉమ్మడి విశాఖ జిల్లా లో రూరల్ సభ్యులు గా ఉండగా నూతనంగా అనకాపల్లి జిల్లా ఏర్పాటైన తరువాత మొట్టమొదటి సారిగా జిల్లా సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు తెలిపారు.ముఖ్యంగా అక్రిడేషన్ మంజూరులో ప్రభుత్వ జాప్యం, ఇండ్ల స్థలాల మంజూరు, యూనియన్ సభ్యత్వ నమోదు తదితర అంశాలు చర్చిస్తామని తెలిపారు. సభ్యులు సభ్యత్వ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు.

మంటలను అదుపు చేస్తున్న రైతులు

జీడి, మామిడి తోటలు దగ్ధం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని కాగిత గ్రామ సమీపంలో ఆదివారం ప్రమాదవశాత్తు జీడి, మామిడి తోటల్లో మంటలు వ్యాపించడంతో తీవ్ర నష్టం జరిగిందని సంబంధిత రైతులు ఆవేదన వెలిబుచ్చారు. జీడి, మామిడి తోటల్లో మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బందికి రైతులు సమాచారాన్ని ఇవ్వడంతో వారు సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, రైతులు మంటలను అదుపు చేశారు.సుమారుగా 6 ఎకరాల్లో తోటలు కాలి పోయాయని, ప్రస్తుతం తోటలు పూత, పిందె దశలో ఉన్నాయన్నారు. టేకు చెట్లు కూడా దగ్ధం అయ్యాయని, లక్షల్లో నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పలుచోట్ల వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కిమ్స్ ఐకాన్ సూపర్ స్పెషాలిటీ ప్రముఖ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం నవ్య లైన్స్ క్లబ్ ప్రతినిధులు వైద్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, వెలగ నారాయణరావు, నవ్య లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రావికమతం: మేడివాడ గ్రామానికి మాజీ సర్పంచ్ పతివాడ చిన్ననాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రతివాడ ధనంజయ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.వైద్యులు వరహాలు 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. దీంతో వీరందరినీ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి ఆదివారం బస్సులో తరలించారు.

పరీక్షిస్తున్న వైద్యురాలు

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

ఎర్రవరంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఐ నేతలు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని పలు ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల్లో ఆదివారం ముమ్మరంగా ప్రచారం చేపట్టారు.

ప్రజాశక్తి-గొలుగొండ:చట్టసభలలో ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు కోరారు. ఆదివారం మండలంలోని ఎర్రవరం రాజులబాబు గుడి వద్ద సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ శెట్టి పైడియ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రామునాయుడు మాట్లాడుతూ, చట్టసభల్లో ప్రశ్నించే గొంతులను ఎన్నుకోవాలని కోరారు. విద్యార్థి, నిరుద్యోగ, యువజన, ఉపాధ్యాయుల ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మేకా సత్యనారాయణ, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎల్వి.రమణ, సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కర్ రావు, ఏఐవైఎఫ్ జి.రాధాకృష్ణ, లోకరవు అప్పలనాయుడు, ఎం.అప్పలనాయుడు, బాబులు, ఎం.బాబులు పాల్గొన్నారు.

కొత్తకోట:కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ కెవిపిఎస్, గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొత్తకోట, మేడివాడ, గర్నికం, రావికమతం గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, ఉద్యోగ, కార్మిక ఔట్సోర్సింగ్ ఉద్యోగ, ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సిహెచ్ సూరిబాబు, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

వారపుసంతలో ప్రజాసంఘాల ప్రచారం

కొయ్యూరు. : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని వారపుసంగిరిజన సంఘం, సిఐటియు ఆధ్వర్యంలోప్రచారం నిర్వహించారు. సంతకు వచ్చే పట్టభద్రుల ఓటర్లతోపాటు ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఉద్యోగులు, స్కీం వర్కర్స్‌ను కలిసి రమాప్రభకు మొదటిప్రాధాన్యత ఓటేయాలని కోరారు. ఏజెన్సీలో జిఒ 3 పునరుద్ధరణ, 1/70, అటవీ హక్కులు, ఇతరత్రా గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్, ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి జారీ, ఇతర సమస్యలపై శాసనమండలిలో ఉత్తరాంధ్ర వాణి వినిపించాలంటే రమాప్రభ గెలుపు ఎంతో అవసరమన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల చిన్నబాబు కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ సిఐటియు నాయకులు, కార్యకర్తలు ఆదివారం ప్రచారం నిర్వహించారు.. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు కార్యక్రమంలో ఆర్ శంకరరావు, భాస్కరరావు, శాస్త్రి, ఆనంద్, రమేష్, అజయ్, తరుణ్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో చేపడుతున్న ప్రచారం

పెందుర్తిలో చేపడుతున్న ప్రచారం

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెందుర్తి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా 94వ వార్డు పరిధి రవినగర్‌లో ఐద్వా ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీచేశారు. పట్టభద్రులు ఆలోచించి ఉన్నతమైన వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వాలని ఐద్వా నాయకులు లక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో బి.రమణి, రజిని. సుహాసిని, సూరీడమ్మ, ప్రదీప్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిఐటియు, సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన సింహాచలం ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును కోరెడ్ల రమాప్రభకు వేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా ముందుకు సాగని రోడ్డు పనులు

-అవస్థలు పడుతున్న పలు గ్రామాల పాదచారులు, వాహనదారులు

ప్రజాశక్తి-రోలుగుంట: నిధులు మంజూరు చేసినా రహదారి పనులు పూర్తి కాలేదని మండలంలోని ఎంకె.పట్నం, బిబి.పట్నం, రత్నంపేట, వడ్డిప గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018 సంవత్సరంలో అప్పటి టిడిపి ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో గొలుగొండ మండలం ఆర్అండ్‌బి రోడ్డు ఏటిగైరంపేట నుండి ఎంకె.పట్నం, బిబి.పట్నం, రత్నంపేట, అలాగే రత్నంపేట నుండి వడ్డిప రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. గుత్తేదారుడు 2019 సంవత్సరం ఎన్నికల ముందు ఆదరాబాదరాగా రహదారి పనులు ప్రారంభించి మెటల్ వేశారు. 2019లో ఎన్నికలు జరిగాయి. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2022లో ప్రస్తుత ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేశారు. ప్రస్తుత గుత్తేదారుడు ఒక మెటల్ పరుపు వేశారు. రెండవ పరుపు వేయుటకు ఈ రహదారికి సరిపడా మెటీరియల్ ఇసుక, పిక్క బిబి.పట్నం జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్‌లో వేశారు. ఆ మెటీరియల్ అక్కడే ఉంది. పనులు మాత్రం పూర్తి చేయలేదు. ఇద్దరు ఎమ్మెల్యేలు నిధులు మంజూరు చేసినా రహదారి పనులు పూర్తి కాక పోవడంతో ఈ నాలుగు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

నిలిచి పోయిన రోడ్డు పనులు

వెండి కిరీటం వితరణ

ప్రజాశక్తి-యస్.రాయవరం:కొరుప్రోలులో నూకాంబికా అమ్మవారికి వెండి కిరీటంను దాతలు ఆదివారం బహుకరించారు. సర్పంచ్ కొరపాటి గోపాలం, పిఎసిఎస్ అధ్యక్షుడు చేకూరి శ్రీరామచంద్రరాజు, దాత యిందుకూరి బంగారమ్మ కుటుంబసభ్యులు కిరీటంను అందచేశారు. రెండుకేజీల ఆరువందల గ్రాముల వెండి సుమారు రెండులక్షల నలభై ఆరువేల రూపాయలు విలువ ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మురళీకృష్ణ, ఆలయ ట్రస్టీ కొంగర రాజు, మాజీ ఎంపిటిసి వరహాలరాజు, పెదసత్తిబాబు పాల్గొన్నారు.

వెండి కిరీటంను ఇస్తున్న దాత

హెటిరో పైపులైన్ అనుమతులు రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో పైపులైన్ అనుమతులు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 458వ రోజుకు చేరింది. ఆదివారం మత్స్యకారులు చేపట్టిన ఆందోళనలో అప్పలరాజు పాల్గొన్నారు. పైపులైన్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులతో కలిసి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు, మత్స్యకారులు మాట్లాడుతూ, పైపులైన్‌ను వ్యతిరేకిస్తూ 458 రోజుల నుండి ఆందోళన చేస్తుంటే నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపక పోవడం దారుణమన్నారు. ఒకవక్క తామంతా పైపులైన్ వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తుంటే, పైపులైన్‌కు అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏ.రాజు, మత్స్యకారులు గోసల సోమేశ్వరరావు, మైలపల్లి మహేష్‌బాబు, కోడా కాశీ, చేపల సోమేష్, మైలపల్లి బాపూజీ, మైలపల్లి నరేష్, కారే కోదండరావు,రాజు, పిక్కి గుర్రన్న, దావీదురాజు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు

DONATE BLOOD SAVE LIFE
ప్రజాశక్తి
విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవ మరియు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా
బ్లడ్ డొనేషన్ క్యాంప్
తేదీ: 8-3-2023 బుధవారం
సమయం : ఉదయం 9 గంటలకు
స్థలం : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ,
జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా, విశాఖపట్నం.
స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ప్రాణదాతలుకండి!
పేర్లు నమోదు చేసుకునేందుకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
దేముడుబాబు : 9490099672
ఎస్.ఎస్.రవి : 9490099676
రాజ్‌కుమార్ : 8712900005